# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 128 | విశాఖపట్నం | 8-2-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 128 | VISAKHAPATNAM | 8-2-2026 SUNDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ — PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంచార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902





రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోంది: బొత్స




రక్తనాళాల్లో బ్లాక్స్ ఉన్నాయా..?




మలేషియాలో పర్యటిస్తున్న మోడీ

## అమరావతి నుంచి దేశాన్ని క్వాంటమ్ లీడర్‌గా

# నిలబెడతాం: చంద్రబాబు

- టెక్ ప్రపంచంలో ఏపీ చారిత్రక అడుగు
- దేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు
- ఐబీఎం, టీసీఎస్, ఎల్&టీ వంటి దిగ్గజాల భాగస్వామ్యం



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ, రాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి టెక్నాలజీ హబ్ నిర్మాణానికి తొలి అడుగు పడింది. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో భాగంగా, భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను నెలకొల్పనున్నారు. ఈ ప్రాజెక్టులో ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, లార్సెన్ అండ్ టూబ్రో వంటి దిగ్గజ సంస్థలు భాగస్వాములుగా వ్యవహరించనున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "1990లలో భారత్‌ను ఐటీ లీడర్‌గా నిలబెట్టడంలో ముందున్నట్లే, ఇప్పుడు అమరావతి నుంచి దేశాన్ని క్వాంటమ్ లీడర్‌గా నిలబెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం" అని అన్నారు. బోస్టన్, సింగపూర్, షాంఘై వంటి గ్లోబల్ క్వాంటమ్ కేంద్రాల సరసన అమరావతిని నిలపాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, వైద్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలకు, ఆవిష్కరణలకు ఈ వ్యాలీ కేంద్రంగా మారనుంది.

ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 88,000 ఉద్యోగాలు సృష్టించవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం, ఈ ఏడాది ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తి చేసి, డిసెంబరు నాటికి క్వాంటమ్ కంప్యూటర్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## నంది అవార్డులను త్వరలోనే ప్రకటిస్తాం: కందుల



**రాజమండ్రి, పతాకం న్యూస్:** సినిమా, టివి, నాటకరంగ కళాకారులకు ఇచ్చే నంది అవార్డులపై ఎపి మంత్రి కందుల దుర్గేష్ కీలక ప్రకటన చేశారు. నంది అవార్డులకు సిఎం చంద్రబాబు ఆమోదముద్ర వేశారని, త్వరలోనే అవార్డులు ఇస్తామని ప్రకటించారు. శనివారం రాజమండ్రిలో మీడియాతో మంత్రి మాట్లాడుతూ .... 2014, 2015, 2016 సంవత్సరాలకు గాను 2017లో (తరువాయి 2వ పేజీలో)

## నకిలీ డీఎస్పీ లోచనకుమార్ అరెస్టు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాల పేరుతో లక్షల్లో కుచ్చుటోపి పెడుతున్న నకిలీ డీఎస్పీ చెల్లుబోయిన లోచనకుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గ్రూప్ 1 పరీక్షల్లో సత్తా చాటినట్లు పత్రికల్లో ఫేక్ ప్రచారాలు చేసుకుంటూ.. లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఈ విషయంపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ లోచనకుమార్‌ను అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించనున్నామని మీడియా సమావేశంలో తెలిపారు.

## 'హైటెక్' దొంగతనాలు చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్టు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విలాసవంతమైన జీవితం కోసం దారి తప్పిన ఓ టెక్కీ ఉదంతాన్ని గాజువాక పోలీసులు గుట్టురట్టు చేశారు. గత కొంతకాలంగా విశాఖ నగరవాసులను వణికిస్తున్న 26 వరుస దొంగతనం కేసులను ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి వివరాలు వెల్లడించారు. గత ఏడాది అక్టోబరులో గాజువాక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కన్నా శివ రామకృష్ణ కుటుంబం అరుణాచలం వెళ్ళిన సమయంలో, వారి ఇంటి తాళాలు పగులగొట్టి 17 తులాల బంగారం, 30 తులాల వెండిని దోచుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసిన గాజువాక క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు దర్యాప్తు ప్రారంభించారు. (తరువాయి 2వ పేజీలో)

## ఏపీలో మున్సిపల్ కమిషనర్ల బదిలీలు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పలు మున్సిపాలిటీలు, యూడీఏలు, కార్పొరేషన్లలో (తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్ — APTEL/25/A2082 — PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH


## ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తున్న బీజేపీ: షర్మిల



**సూళ్లూరుపేట, పతాకం న్యూస్:** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు పంచాయతీలో ఏఐసిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి రచ్చబండ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుని వచ్చిన మహాత్మా గాంధీ జాతి ఉపాధి హామీ పథకం చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నీరుగారుస్తుందని,పేదల కడుపు కొట్టేందుకే పథకం పేరు మార్చి 125 రోజులు పెంచుతున్నట్లు బూటకపు మాటలు చెబుతున్నారని తెలిపారు. 8 గంటల ఉన్న పనిని 12 గంటలు చేశారని, పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం,కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తామని చెప్పడం పేద ప్రజలకు ద్రోహం చేసినట్లు కాదా అని మండిపడ్డారు. (తరువాయి 2వ పేజీలో)

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## నీరు-ప్రాధాన్యతలు

ప్రతి ఎకరాకు సాగునీరందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని అమరావతిలో నిర్వహించిన నీరు-ప్రగతి, జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సూచించడం మంచిదే! అలాగే ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగును ముందస్తుగా ప్రారంభించాలని తుపానుల వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులను సన్నద్ధం చేయాలని, కాల్వలకు మే 15 కల్లా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడం స్వాగతించదగినది. 'వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలని, పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని నిలబెట్టాలి, నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి...' అని చెప్పడం బాగానే వుంది. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిలో 1,300 టిఎంసిలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలమనీ, ఈ ఏడాది 862 టిఎంసిల నీళ్లు మన జలాశయాల్లో నిల్వ ఉన్నాయని వాస్తవాలు వివరించారు. పై అంశాలతోపాటు ముఖ్యమంత్రి ప్రస్తావించిన కొన్ని విధానపరమైన విషయాలూ, మీడియాలో వచ్చిన వార్తలూ రైతాంగాన్ని, రాష్ట్ర ప్రజలను కలవరపరుస్తున్నాయి. వరిసాగు తగ్గించి ఎక్కువ మంది రైతులు ఉద్యాన పంటలు, తృణ ధాన్యాల (మిల్లెట్స్) వైపు దృష్టి సారించాలనడం పంటల సరళిని ఏకపక్షంగా మార్చడమే! పంటల సరళిలో మార్పు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరగాలే తప్ప హడావుడిగా చేయరాదు. ఆయా పంటల సాగుకు భూసార అనుకూలతలు, నీటిపారుదల సౌకర్యాల లభ్యత లేదా కొరత, పంటల ఉత్పత్తుల వినియోగం, నిల్వ అవకాశాలు, మార్కెట్ పరిస్థితులు వగైరా అనేక అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాకనే నిర్ధారించుకొని, అవసరమైన ప్రోత్సాహకాలిచ్చి అన్నదాతలను అటువైపు మళ్లించవలసి వుంటుంది. కానీ ఆ తరహా ఆలోచనలు, తగిన సన్నాహాలు చేయకుండా ఇటువంటి సలహాలివ్వడం రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు. అలాగే 2027 జూన్ కంటే ముందే పోలవరం జాతికి అంకితం చేస్తామంటూనే ఆ ప్రాజెక్టు పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతామని, పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై కదా ప్రాధాన్యత? అంతేగాక వివాదాస్పదంగావున్న నల్లమల సాగర్ మాట ఇప్పుడు చెప్పడం ద్వారా తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత, సౌభ్రాతృత్వానికి ఇబ్బందులు తెచ్చుకోవడమే అవుతుంది. అంతేగాక తక్కువ ఖర్చుతో సత్వర ఫలితాలిచ్చే పెండింగ్ ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం విజ్ఞతగా ఉంటుంది. రాష్ట్రంలో నీటి వినియోగానికి సంబంధించి కొత్త పాలసీ తీసుకు వస్తున్నట్టు, దాన్ని ప్రకటిస్తారనీ విశ్వసనీ యమైన ఆంగ్ల మీడియాలో కథనాలొచ్చాయి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో అమల్లో ఉన్న రెగ్యులేటరీ కమిషన్‌లా నీటి వినియోగానికి కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా వచ్చింది. గతంలోనే ప్రపంచబ్యాంకు సాగు నీటికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం, అందులో భాగంగా సాగునీటి మీటర్ల ఏర్పాటుకు ఆనాటి (చంద్రబాబు నాయుడు) ప్రభుత్వం విఫలయత్నం చేసిన విషయాలు ప్రజల స్మృతి పథం నుండి ఇంకా తొలగిపోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేయడం అన్నదాతలతో సర్కారు కయ్యం తెచ్చుకోవడమే అవుతుంది. నీటి సరఫరాకు చేస్తున్న ఖర్చుకు తగ్గట్టుగా ప్రజల నుండి వసూలు చేసే పన్నులు ఉండేలా చూడటం కూడా పాలసీలో భాగమంటున్నారు. యూజర్ ఛార్జీలు వసూలు చేయకపోతే భవిష్యత్ నిర్వహణ కష్టం అవుతుందని తొలుత పరిశ్రమలతో ప్రారంభించి, ఆ తరువాత అందరికీ దీనిని విస్తరించే అవకాశం ఉందని సమాచారం. అంతకన్నా ముఖ్యంగా నీటి వినియోగ ప్రాధాన్యతల్లోనూ సర్కారు మార్పులు చేయబోతున్నదని వస్తున్న వార్తలు ఆందోళనకరం. ఇప్పటికే ప్రభుత్వం పంటలకంటే పరిశ్రమలకు, జెన్‌కో అధ్వర్యంలోని జల విద్యుత్ కన్నా కార్పొరేట్లు తెస్తున్న పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకూ మొగ్గు చూపుతున్న వైనం ద్యోతకమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చే జల విధానం పై ఎవరికైనా సందేహాలు కలగడం సహజం. ఏదిఏమైనా అంతర్జాతీయ జల సూత్రాల ప్రకారం ప్రజలకు తాగు నీరు, పంటలకు సాగు నీరు, జల విద్యుత్, ఆ తరువాతనే పరిశ్రమలు, ఇతర అవసరాలనే ప్రాధాన్యత క్రమానికి లోబడి ప్రభుత్వం వ్యవహరించడం సబబుగా ఉంటుంది.

## రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోంది: బొత్స



**విజయవాడ, పతాకం న్యూస్:** మాజీ మంత్రి జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలను వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ గట్టిగా సమర్థించారు. జోగి రమేశ్ ఇంటిపై జరిగిన పెట్రోల్ బాంబుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఇది కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. శనివారం ఎన్టీఆర్ జిల్లాలోని జోగి రమేశ్ నివాసాన్ని పార్టీ నేతలతో కలిసి పరిశీలించిన అనంతరం బొత్స మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, అటవిక రాజ్యం నడుస్తోందని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "అసలు జోగి రమేశ్ చెప్పిన దాంట్లో తప్పేముంది? మంత్రి లోకేశ్ కే కాదు, చంద్రబాబుకు కూడా చిప్ పోయినట్లుంది. చిప్ పోతేనే ఇలాంటి నీచమైన పనులు చేస్తారు" అని బొత్స ఘాటుగా విమర్శించారు. రమేశ్ ఇంటిపై దాడి క్షణికావేశంలో జరిగింది కాదని, పక్కా ప్రణాళికతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గూండాలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. ఒక మాజీ మంత్రి ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడి చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గూండాలకు పోలీసులు ఎస్కార్టుగా వ్యవహరించడం తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారికి స్టేషన్ బెయిల్ ఎలా ఇస్తారని, వారిపై 304 సెక్షన్ ఎందుకు నమోదు చేయలేదని పోలీసుల తీరుపై మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని బొత్స నిలదీశారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని, ఇది హేయమైన చర్య అని అన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారం వంటి అంశాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే టీడీపీ ప్రభుత్వం ఇలాంటి దాడులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తలు గానీ, నేతలు గానీ ఇలాంటి బెదిరింపులకు భయపడరని, ఈ ఘటనపై న్యాయపరంగా పోరాటం చేస్తామని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## జగన్‌పై మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్



**విజయవాడ, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర మరోసారి విమర్శలు గుప్పించారు. ఆటవిక రాజ్యం అంటే ఎలా ఉంటుందో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ చూపించారని ఆయన అన్నారు. జగన్ కు జంగిల్ రాజ్ అవార్డు ఇవ్వొచ్చని వ్యంగ్యంగా అన్నారు. వైసీపీ ఆటవిక రాజ్యంలో హింసాత్మక ఘటనలను జగన్ ప్రోత్సహించారని విమర్శించారు. దేవాలయాల మీద, పార్టీ కార్యాలయాల మీద దాడులు చేయించారని దుయ్యబట్టారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బూతులు తిట్టి తన్నులు తిన్నవారిని పరామర్శించేందుకు జగన్ వెళుతున్నారని... పరామర్శలకు వెళుతూ విద్వేషాల వెనుక తానే ఉన్నానని జగన్ చాటుకుంటున్నారని కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. తెనాలిలో బ్లేడ్ బ్యాచ్ ను పరామర్శించి... ఇలాంటి వారిని తాను ప్రోత్సహిస్తాననే విధంగా సందేశం ఇచ్చారని విమర్శించారు. జగన్ చేతల వల్లే ఆ పార్టీ 151 నుంచి 11కి పడిపోయిందని అన్నారు. ఇప్పటికైనా జగన్ బుద్ధి తెచ్చుకోవాలని... లేకపోతే అథఃపాతాళానికి పడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.

## మలేషియాలో పర్యటిస్తున్న మోడీ



**మలేషియా:** రెండురోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోడీ శనివారం మలేషియాకు చేరుకున్నారు. మోడీకి మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఇరువురూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. అలాగే మలేషియాలోని ప్రవాస భారతీయులు మోడీకి ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత మోడీ, అన్వర్‌లు ఇద్దరూ ఒకే కారులో అధికారిక హోటల్‌కు వెళ్లారు. కాగా, మలేషియా- భారత్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి తమ చర్చలు దోహదపడనున్నాయని మోడీ పర్యటనకు ముందు ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఆర్థిక, ఆవిష్కరణ, కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని ఇరు దేశాలు సహకారం మరింత పెంచుకోవడమే లక్ష్యంగా ఉండనున్నట్లు మోడీ పోస్టులో పేర్కొన్నారు.

### శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు...

## చంద్రబాబుకు ఆహ్వానం



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం అందింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ బోర్డు ఛైర్మన్ రమేశ్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు నేడు అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబుకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ పండితులు వేదమంత్రాలతో ఆయనకు ఆశీర్వచనం అందించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే, ఆలయ బోర్డు సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రత, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా హాజరుకావాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సీఎం చంద్రబాబును ఆహ్వానించారు.

(మొదటిపేజీ తరువాయి)

## 'హైటెక్' దొంగతనాలు చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్టు

నగరం అంతటా ఇదే తరహాలో (అరిలోవ, మల్కాపురం, పెందుర్తి పరిధిలో) వరుస దొంగతనాలు జరుగుతుండటంతో పోలీసులు ఈ కేసును సవాలుగా తీసుకున్నామని అందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వందలాది సీసీటీవీ కెమెరాలను విశ్లేషించి, సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు, శనివారం ఉదయం గాజువాక మిండి ఆర్చ్ వద్ద నిందితుడు అచ్చి మహేష్ రెడ్డి ఏ సన్నీ (27) ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పోలీసుల విచారణలో నిందితుడి గురించి ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయని పోలీసులు వివరించారు. నిందితుడు పీజీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. 15 ఏళ్ల వయస్సు నుంచే దొంగతనాలకు అలవాటుపడ్డాడు. ఇప్పటివరకు ఇతనిపై కాకినాడ, రాజమండ్రి, విశాఖ సహా వివిధ జిల్లాల్లో 60కి పైగా కేసులు ఉన్నాయని తెలిపారు. దొంగిలించిన సొమ్ముతో ఒక బిఎండబ్ల్యు కారు కూడా కొనుగోలు చేసి రాజభోగాలు అనుభవిస్తున్నాడని అన్నారు. అరెస్ట్ అనంతరం అతడి వద్ద నుండి 699 గ్రాముల బంగారు ఆభరణాలు, 3.8 కేజీల వెండి వస్తువులు. ఒక బి ఏం డబ్ల్యు కారు, క్రైమ్ కోసం వాడే స్కూటీ. దొంగతనాలకు ఉపయోగించే డ్రిల్లింగ్ మెషిన్, ఐరన్ రాడ్ వంటి పనిముట్లు. స్వాధీనం చేసుకున్నామని రికవరీ చేసిన మొత్తం సొత్తు విలువ సుమారు రూ. 24.66 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. నగర ప్రజలు ఊర్లకు వెళ్ళేటప్పుడు తమ విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో ఉంచుకోవాలని, ఎల్ హెచ్ ఏం ఎస్ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ఇళ్లకు స్మార్ట్ లాక్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రతను పటిష్టం చేసుకోవాలని కోరారు.

## ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తున్న బీజేపీ: షర్మిల

కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలు భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు ఆచరణలో పెట్టాయని తెలిపారు.గ్రామాలలో గుడులు, బడులు లేకపోయినా బెల్ట్ షాపులు మాత్రం అధికంగా ఉన్నాయని,రాష్ట్రంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని,రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అనారోగ్యంతో ఉందని తెలిపారు.మళ్లీ మన అందరి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అటు దేశం అభివద్ధి పథంలో దూసుకుపోతుందని వైయస్ షర్మిల తెలియజేశారు.పై కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురువం బాబు,కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ మావుడూరు వెంకటాచలపతి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ ఇన్చార్జీలు, మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నంది అవార్డులను త్వరలోనే ప్రకటిస్తాం : కందుల

నంది అవార్డులను అప్పటి ప్రభుత్వం (టిడిపి) ఇచ్చిందని... ఆ తర్వాత మళ్లీ ఇవ్వలేదని గుర్తు చేశారు. అప్పటి నిబంధనల ప్రకారమే ఇప్పుడు కూడా అవార్డులు ఇవ్వాలా? లేక మార్పులు ఏమైనా చేయాలా ? అనే దానిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, నందమూరి బాలకృష్ణ నుంచి ఈ అవార్డులపై సలహాలు తీసుకుంటామని తెలిపారు. రెండు, మూడు నెలల్లో అవార్డుల వేడుక ఉంటుందని వెల్లడించారు. నంది నాటకోత్సవాలను కూడా నిర్వహిస్తామని వెల్లడించారు.

## ఏపీలో మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

కీలక అధికారుల మార్పులు చేపట్టింది. అనంతపురం మున్సిపల్ కమిషనర్‌గా ఎం. జస్వంత్‌రావును నియమించగా.. అక్కడ పనిచేస్తున్న బి. బాలస్వామిని విజయనగరానికి బదిలీ చేశారు. పల్నాడు యూడీఏ కార్యదర్శిగా ఉన్న జి. సాంబశివరావును గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. గుంటూరులో ఉన్న టి. వెంకటకృష్ణయ్యను పల్నాడు యూడీఏ సెక్రటరీగా నియమించారు. 1గుంతకల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీఎంఏ నయీం అహ్మద్‌ను ఆదోనికి బదిలీ చేయగా.. అక్కడ ఉన్న కృష్ణను సీఆర్‌డీఏకు పంపించారు. ఏలూరు యూడీఏ కార్యదర్శిగా వెయిటింగ్‌లో ఉన్న పి. సింహాచలంను నియమించారు. ఒంగోలు యూడీఏ కార్యదర్శిగా ఉన్న ఆర్ చండి దేవసేనను తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. విజయవాడలో శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్న కె. శివరామ్‌ప్రసాద్‌ను వినుకొండ కమిషనర్‌గా నియమించారు. వినుకొండలో శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం. సుభాష్ చంద్రబోస్‌ను సీడీఎంఏకు రిపోర్టు చేయాలని ఆదేశించారు. అలాగే, కల్యాణదుర్గంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్న ఎస్. నూర్ అలీఖాన్‌ను కమలాపురం నగరపంచాయతీ కమిషనర్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ప్రహ్లాద్‌ను సీడీఎంఏకు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ ర్యాలీ





**భోగాపురం, పతాకం న్యూస్:** తీర ప్రాంత భద్రత, దేశ భక్తి, పర్యావరణ పరిరక్షణ పట్లపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ధ్యేయంగా సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్) ఆధ్వర్యంలో వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు వెళ్తున్న సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ ర్యాలీకి స్థానిక జాతీయ రహదారిపై ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు ఘన స్వాగతం పలికారు. వందేమాతరం, భారత మాతకు జై, జై భారత్ అనే నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తి పోయింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రెండు బృందాలు తొమ్మిది రాష్ట్రాల గుండా సుమారు 6,553 కిలో మీటర్ల మేర తూర్పు, పశ్చిమ తీర ప్రాంతాల్లో ఉన్న 52 తీర గ్రామాల్లో సైకిల్ ర్యాలీ ద్వారా పర్యటించనున్నట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్ బఖాళి నుంచి తూర్పు తీరానికి ఒక బృందం, పశ్చిమ తీరంలో ఒక బృందం ఈ ర్యాలీని ప్రారంభించాయన్నారు. ఈ ర్యాలీ గతనెల 28న ప్రారంభమైందన్నారు. 25 రోజుల పాటు సాగి ఈ నెల 22న కేరళలోని కొచ్చిన్ తీరంలో ముగుస్తుందన్నారు. ఈ బృందంలో సీఐఎస్ఎఫ్‌కి చెందిన 136 మంది సభ్యులు ఉన్నారని అన్నారు. తీరం వెంట అపరిచిత వ్యక్తులు, పడవలు, అనుమానితులు ఎవరైనా కనిపిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే దేశ భద్రతకే ముప్పు ఏర్పడే ప్రమాదముందని అన్నారు. కార్యక్రమంలో సీఐ కె.దుర్గాప్రసాదరావు, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఏకే మహాపాత్ర, ఎస్ఐలు పాపారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండి' కార్యక్రమానికి శ్రీకారం: సీఎండీ పృథ్వీతేజ్




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండి' విధానాన్ని ప్రవేశపెడుతున్నామని సంస్థ సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించనున్న డయల్ యువర్ సీఎండి కార్యక్రమాన్ని ఈనెల 9 వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, ఏ ఎస్ ఆర్ పాడేరు, రాజమహేంద్రవరం, కాకినాడ, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఫోన్ నంబరు 8688400499 ద్వారా విద్యుత్ సంబంధిత సమస్యలను తెలియజేయవచ్చని వెల్లడించారు. విశాఖపట్నం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ సీఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండి దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ అవకాశాన్ని సంస్థ పరిధిలోని 11 జిల్లాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సీఎండి పృథ్వీతేజ్ విజ్ఞప్తి చేసారు.

# ఉక్కు సీఎండీ ఎంపికకు నోటిఫికేషన్




**గాజువాక, పతాకం న్యూస్:** విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు కొత్త ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)ను నియమించడానికి సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ విభాగం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ బాధ్యతను సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీకి అప్పగించింది. ఈసారైనా పూర్తిస్థాయి సీఎండీకి బాధ్యతలు అప్పగిస్తారా?, లేదా?...అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్టీల్ ప్లాంటుకు ప్రస్తుతం సెయిల్ డైరెక్టర్ మనీశ్‌రాజ్ గుప్తా ఇన్‌చార్జి సీఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన జనవరిలో బాధ్యతలు చేపట్టారు. అప్పటివరకు మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్) ఛైర్మన్ ఏకే సక్సేనా ఇన్‌చార్జి ఛైర్మన్‌గా 15 నెలలు పనిచేశారు. వాస్తవానికి అతుల్‌భట్ సీఎండీగా ఉండగా 2024లోనే కొత్త సీఎండీ కోసం ప్రకటన ఇచ్చారు. 'ది ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్'లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శక్తిమణిని ఎంపిక చేశారు. అతుల్‌భట్‌కు ఇంకా రెండు నెలల పదవీ కాలం ఉండగానే పనితీరు బాగా లేదని 2024 సెప్టెంబరులో పంపించేశారు. ఆ స్థానంలో శక్తిమణిని నియమించాల్సి ఉంది. కానీ ఇక్కడే ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఏకే బాగ్చీకి సీఎండీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఆయన సీఎండీ సీట్లో కూర్చొని 20 రోజులు కాక ముందే...ఎంఓఐఎల్ నుంచి ఏకే సక్సేనాను తీసుకువచ్చారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన సీఎండీ ఉండగా ఇలా ఎప్పుడూ వేరొకరిని నియమించలేదు. అడ్డగోలుగా వచ్చిన ఏకే సక్సేనా తన పదవీకాలం పూర్తయ్యే వరకు 2025 డిసెంబరు వరకూ ఇక్కడే కొనసాగారు. ఎంపికైన శక్తిమణిని పూర్తిగా పక్కన పెట్టేశారు. సక్సేనా వెళ్లిపోయాక సెయిల్ డైరెక్టర్ మనీశ్ రాజ్ గుప్తాకు బాధ్యతలు అప్పగించారు. ఈలోగా శక్తిమణి నియామకపు గడువు ముగిసిపోవడంతో ఇప్పుడు కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చారు. ఆసక్తి కలిగినవారు మార్చి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పుడైనా నిబంధనల ప్రకారం ఎంపిక చేసిన అధికారిని నియమిస్తారా?, లేదంటే ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తారా?....అని ఉద్యోగ వర్గాలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి.

# 12న లేబర్ కోడ్స్ పై దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ప్రజలుకు పిలుపు



**మల్కాపురం, పతాకం న్యూస్:** కార్మికులను బానిసలుగా చేసే 4 లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి అని డిమాండ్ చేస్తూ గోడపత్రికను నాయకులు విడుదల చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్కు సొంత గనులు కేటాయించాలి. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన పథకం, వీఓఏ, ఆర్పీ తదితర స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ముఠా, ఆటో, బిల్డింగ్, తోపుడుబళ్లు, గిగ్ వర్కర్స్ మొ॥ అసంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్తో కూడిన సమగ్ర చట్టం చేయాలి. విద్యుత్ సవరణ, విత్తనాల సవరణ బిల్లులను రద్దు చేయాలి. రైతు పంటలకు గిట్టుబాటు ధర, కౌలు రైతులకు గుర్తింపుకార్డులు, రుణాలివ్వాలి. వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. ఉపాధిహామీ పథకంలో మార్పులను రద్దు చేయాలి. పట్టణ ప్రాంతాల్లోనూ అమలు చేయాలి. 200 రోజులు పని కల్పించాలి. సీపీఎస్ రద్దు - పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. కనీస పెన్షన్ రూ. 9 వేలు ఇవ్వాలి. లి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, టైమ్స్ స్కేల్ తదితర ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

# రైల్వే ఫ్లైఓవర్ భూ సమస్యపై ఎమ్మెల్యే కొణతాల ఆరా



**అనకాపల్లి పతాకం న్యూస్:** స్థానిక లక్ష్మీదేవిపేట, రైల్వేస్టేషన్ రోడ్డును ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారులతో కలిసి పరిశీలించారు. ఫ్లైఓవర్ వంతెన పనులు కొన్నేళ్లుగా ముందుకు సాగని విషయం తెలిసిందే. ఇక్కడ నెలకొన్న భూ సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కరించడం ద్వారా వంతెన నిర్మాణం చేపట్టాలన్న ఉద్దేశంతో ఆయన పర్యటించారు. వంతెనకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించి, దీని నిర్మాణం కోసం ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ఎంత మేరకు అవసరమో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో షేక్ ఆయీషా, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, పలువురు అధికారులు వున్నారు.

# ఒకటో తరగతి ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం: స్వామినాయుడు



**పాడేరు, పతాకం న్యూస్:** విద్యాహక్కు చట్టంలో భాగంగా 2026-27 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ఉచిత సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ వీఏ.స్వామినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టంలో భాగంగా అర్హులైన పేదలకు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లను కల్పిస్తారని, అందుకు ఈనెల 20 నుంచి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు వెబ్‌సైట్, గ్రామ సచివాలయం మండల విద్యాశాఖాధికారి కార్యాలయం, సంబంధిత పాఠశాలలోనూ మార్చి 10 తేదీలోగా దరఖాస్తు చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థి 2020 జూన్ 2 నుంచి 2021 మే 31 మధ్యలో జన్మించి ఉండాలనే నిబంధన ఉందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 7 నుంచి 16 వరకు ప్రైవేటు పాఠశాలల వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, ఈనెల 20 నుంచి మార్చి 10వ తేదీ వరకు విద్యార్థుల ఆన్‌లైన్ నమోదు చేయాలని, మార్చి 17న గ్రామ సచివాలయల వారీగా దరఖాస్తుల వివరాలు, అర్హులైన విద్యార్థుల జాబితా రూపకల్పన, మార్చి 25న తొలి విడత అర్హులకు సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. అలాగే ఏప్రిల్ 7 లోపు ప్రవేశాల ధ్రువీకరణ, ఏప్రిల్ 12న రెండో విడత సీట్ల కేటాయింపు, ఏప్రిల్ 13న నుంచి 23 వరకు పాఠశాలల ద్వారా విద్యార్థుల ప్రవేశాల ధ్రువీకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఎటువంటి సందేహాలున్నా టోల్ ఫ్రీ నంబర్: 18004258599కు సంప్రదించవచ్చునని సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు సూచించారు.

# నో వర్క్ నో పే సిద్ధాంతం తీసుకురావాలి: అయ్యన్న



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** 'ఉద్యోగి విధులకు రాకపోతే సస్పెండ్ చేస్తున్నాం. జీతం ఆపుతున్నాం. అలాంటప్పుడు ఎమ్మెల్యే అసెంబ్లీకి రాకపోతే జీతం ఎందుకివ్వాలి. ఎందుకు సస్పెండ్ చేయకూడదు. దీనిపై ఆలోచన చేయాలి. నో వర్క్, నో పే సిద్ధాంతాన్ని తీసుకురావాలి. అప్పుడే ఈ తరం కాకపోయినా, తర్వాత తరాలకు ఒక గుణపాఠంగా ఉంటుంది'...అని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. నగరంలోని పిఠాపురం కాలనీలో గల కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానేతలు ఎన్టీఆర్, ఇందిరాగాంధీ వంటి వారే ఓటమి పాలయ్యారని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అలాంటి వారిని చూసి నేర్చుకోవాలన్నారు. గెలుపు, ఓటములు ప్రజా నిర్ణయమన్నారు. గెలిచాక రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలి తప్ప...గొడవలు సృష్టించడానికి కాదన్నారు. ప్రజా సమస్యలు మాట్లాడాలంటే అసెంబ్లీకి రావాలని, బయట ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదన్నారు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు సమాధానం చెబుతారని, వారు చెప్పకపోతే తాను చెప్పిస్తానని చెప్పారు. బయట తిరుగుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేయకుండా, అసెంబ్లీకి రండి ఎంత సమయం కావాలో అంత సమయం ఇస్తాను, అక్కడ మాట్లాడండని...అంటూ పరోక్షంగా జగన్‌కు సూచించారు.

# విద్యార్థులను చితకబాదిన హెచ్ఎంపై శాఖాపరమైన చర్యలు



**సీలేరు, పతాకం న్యూస్:** భోజనం బాగుండలేదన్నందుకు హెచ్ఎం విద్యార్థులను చితకబాదిన ఘటనపై గిరిజన సంక్షేమ శాఖ డీడీ పరిమళ విచారణ నిర్వహించారు. జీకేవీధి మండలం ధారకొండ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విజయకుమార్, ప్రభుదాస్ అనే విద్యార్థులు గురువారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ప్రధానోపాధ్యాయుడు హేమచంద్ర వద్దకు వెళ్లారు. సార్.. భోజనం రుచికరంగా వండడం లేదంటూ ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహించిన హెచ్ఎం వారిద్దరిని చితకబాదడంతో ఫిట్స్‌తో ఒకరు, శ్వాస అందక మరో విద్యార్థి విలవిలలాడుతూ ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు, విద్యా కమిటీ ఛైర్మన్ జిల్లా కలెక్టర్‌కు, ఐటీడీఏ పీఓ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు ఫిర్యా చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) పరిమళను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ ఆదేశించారు. ఈ మేరకు ధారకొండ ఆశ్రమ పాఠశాలలో డీడీ పరిమళ తొలుత విద్యార్థులతో మాట్లాడారు. తర్వాత హెచ్ఎంను కూడా విచారించారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ డీడీ పరిమళ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. విద్యార్థులను హెచ్ఎం కొట్టిన సంఘటన వాస్తవమేనని తమ విచారణలో వెల్లడైయిందన్నారు. ఈ ఘటనకు బాధ్యుడైన హెచ్ఎం హేమచంద్ర ను ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు నివేదికను కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు అందజేస్తామన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి పాల్గొన్నారు.

# సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు ఎదగాలి: వెంకయ్యనాయుడు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పెందుర్తిలోని బాలాజీ హై ఫీల్డ్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో పిల్లలకు విద్యతో పాటు సంస్కారాన్ని కూడా నేర్పించాలని అన్నారు. పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత విద్యాలయాలపై ఉందన్నారు. చదువు అంటే కేవలం ఉద్యోగం సంపాదించడమే కాదని, సమాజానికి ఉపయోగపడే మంచి వ్యక్తులుగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. అభివృద్ధి అంటే భవనాలు కట్టడం మాత్రమే కాదని, ప్రకృతిని కాపాడుకునే బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.. భారతదేశమని అన్నారు వెంకయ్యనాయుడు. ఈ మధ్యకాలంలో కొంతమంది నాయకులు విర్రవీగుతూ బూతులు తిడుతున్నారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజలు పోలింగ్ బూత్‌లోనే తగిన సమాధానం చెప్పాలన్నారు. రాజకీయ నాయకులకు బూతులు మాట్లాడటం ఒక ఫ్యాషన్‌లా మారిపోయిందని మండిపడ్డారు. ఎంత ఎక్కువ బూతులు మాట్లాడితే అంత పబ్లిసిటీ వస్తుందని కొందరు భావిస్తున్నారని విమర్శించారు. రాజకీయ నాయకులు అందరికీ ఆదర్శంగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి సూచించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి శాసనసభ్యులు కంచికల రమేశ్ బాబు, విశాఖపట్నం మేయర్ పీల శ్రీనివాస్‌లతో పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్కూల్ పిల్లలతో కొంతసేపు సరదాగా మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి.. ఆ తర్వాత స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీముఖలింగంలో ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శ్రీముఖలింగంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'శివరాత్రి ఉత్సవాలకు గతేడాది కంటే భక్తులు పెరిగే అవకాశమున్నందున క్యూలైన్లు పెంచి 300 మీటర్లు వరకు బారికేడ్లు నిర్మించాలి. ఎండ తగలకుండా షామ్యానాలు వేయాలి. వీఐపీలను దక్షిణద్వారం గుండా విడిచిపెట్టకుండా ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేయాలి. భక్తులు అడ్డదారిలో రాకుండా కట్టడి చేయాలి. ఉచిత, ప్రత్యేక దర్శనాలకి వేర్వేరు బారికేడ్లు ఏర్పాటు చేయాలి. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటరు అందుబాటులో ఉంచాలి. పారిశుధ్య నిర్వహ ణ చేపట్టాలి. చక్రతీర్థ స్నానాలకు వంశధార నదిలో నీటిప్రవా హం ఉండేలా చర్యలు తీసుకోవాలి. వాహనాల పార్కింగ్ కు స్థలాన్ని కేటాయించి.. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం చేయాల'ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎస్సీ కె.వి.మహేశ్వరరెడ్డి, దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఈవో ఏడుకొండలు, ఆర్డీవో కె.సాయిప్రత్యూష, టెక్కలి డీఎస్పీ బి.లక్ష్మణరావు, సీ.ఐ శ్రీనివాసరావు, జలుమూరు ఎస్.ఐ బి.అశోక్‌బాబు, తహసీల్దారు జె.రామారావు, ఎంపిడివో బి.చిన్నమ్మడు, ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణ, విద్యుత్ డీఈ జి.సురేష్, ఏఎంసీ అధ్యక్షుడు తర్ర బలరాం, ఆలయ పాలక మండలి చైర్మన్ శివప్రసాద్ పాడి పాల్గొన్నారు. ప్రసిద్ధ శైవక్షేత్రం.. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో మహాశివరాత్రి ఉత్సవాలకు శుభరాట(పందిరిరాట) వేశారు. ఈ నెల 15 నుంచి 18 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈవో ఏడుకొండలు ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు బంకుపల్లి భూషణశర్మ నేతృత్వంలో శుభరాట ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో అంతా శుభమే జరగాలని దేవతామూర్తులకు పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు.

## జంతు సంక్షేమానికి అధికారులంతా కృషి చేయాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** జంతు సంక్షేమానికి అధికారులంతా కృషి చేయాలని విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి సూచించారు. సాయంత్రం విజయనగరంలోని తన చాంబర్‌లో ఆమె జంతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న పశువుల సంతల్లో పశువులు హింసకు గురికాకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అక్రమ రవాణా జరగకుండా పోలీసులు నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ గోసంరక్షణ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా, పశు మాంసం విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. వెంటనే ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డీడీ దామోదర్, మండలా తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా బార్ లైసెన్స్‌ల కేటాయింపు




**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో బార్ లైసెన్స్‌ల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత తెలిపారు. పార్వతీపురం, సాలూరు పట్టణాలకు సంబంధించిన నాలుగు బార్ల కేటాయింపు ప్రక్రియను కలెక్టరేట్‌లో నిర్వహించారు. తొలుత డీఆర్వో లాటరీ తీసి బహిరంగంగా దరఖాస్తుదారులకు చూపించారు. మొత్తం 20 మంది దరఖాస్తు చేసుకోగా, పార్వతీపురంలోని మూడు బార్లను, సాలూరు పట్టణ పరిధిలో ఒక బారుకు డ్రా ద్వారా లైసెన్స్‌లు కేటాయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్, ఆ శాఖాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు తోడ్పడాలి: కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి




**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లా ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు తోడ్పడాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రుణాల మంజూరు ప్రక్రియలో బ్యాంకర్లు మరింత ఉత్సాహంగా పాల్గొని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో పలు బ్యాం కర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా యంత్రాంగంతో బ్యాంకర్లు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. లబ్ధిదారులను గుర్తించి సకాలంలో రుణాలు అందజేయాలని, వారిలో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించాలని సూచించారు. దీనివల్ల జిల్లా ఆర్థికంగా బలోపేతమవుతుందన్నారు. ప్రజలకు ఆర్థిక క్రమశిక్షణ, అక్షరాస్యతపై బ్యాంకర్లు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని.. ప్రజలందరికీ బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ చేయాలని కోరారు. గ్రామీణుల అవసరాలను గుర్తించి వారికి ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు. ఖాతాదా రులకు ఆర్థిక లావాదేవీలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని మేనేజర్లను ఆదేశించారు. గ్రామాల్లో 'ముచ్చట్లు' కార్యక్రమం జరగనుందని, దీనిని బ్యాంకర్లు వినియోగించుకోవాలని సూచిం చారు. గత పదేళ్లలో మంజూరు చేసిన రుణాలు, యూనిట్లపై సమీక్షించాలన్నారు. రుణాలతో యూనిట్లు స్థాపించి ఆర్థికంగా ఎదిగిన లబ్ధిదారుల విజయగా?థలను అందరికీ తెలియజేయా లన్నారు. మొండి బాకీల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. రానున్న రెండు వారాల్లో భారీ స్థాయిలో రుణమేళాలు నిర్వహించాలన్నారు. మంగళ, బుధ, గురువారాల్లో ఏపీజీబీ, ఇతర బ్యాంకు బ్రాంచ్‌ల వారీగా ఈ మేళాలు జరగాలని ఆదేశించారు.

## రిమ్స్‌ను అభివృద్ధి చేస్తాం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)ను అభివృద్ధి చేస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఆసుపత్రిని ఆకస్మికంగా పర్యటించి, రోగులకు అందజేస్తున్న సేవలు, మందులపై ఆరాతీశారు. లైబ్రరీ, లెక్చరర్ హాలును పరిశీలించారు. ఫర్నీచర్ అవ సరమని తెలుసుకుని వెంటనే ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో ఫోన్లో మాట్లాడారు. త్వరలో ఈ రెండు హాల్స్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. ఆడిటో రియం, లేడీస్ హాస్టల్ భవనాలను కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, ఆర్ఎంవో సుభాషిణి పాల్గొన్నారు.

## నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



**జి.సిగడాం, పతాకం న్యూస్:** రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ ఈఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. రామభద్రాపురం- చిలకపాలేం ప్రధానరహదారిలో భాగంగా నిర్మిస్తున్న బీటీ రహదారి పనులను ఆయన పరిశీలించారు. గేదెలపేట నుంచి వాండ్రంగి రైల్వే బ్రిడ్జి వరకు రూ. 2.75 కోట్లతో నిర్మిస్తున్న 6.4 కిలో మీటర్లు మేర నాలుగు కిలోమీటర్లు మేర పనులు జరిగాయి. వీటిని క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది నిర్మాణంలో నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట క్వాలిటీ కంట్రోల్ డీఈ గౌరీశ్వరరావు, ఏఈఈ జగన్మోహన్‌రావు, ఆర్అండ్‌బీ డీఈ గణపతిరావు, ఏఈఈలు పిటీ రాజు, వాసు ఉన్నారు.

## కలగా రైతు బజారు ఏర్పాటు



**బొబ్బిలి, పతాకం న్యూస్:** నియోజకవర్గ కేంద్రం బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటు కలగా మారింది. ప్రతిసారీ ఎన్నికల ముందు రైతు బజారు ఏర్పాటు చేస్తామని నాయకులు హామీలు ఇవ్వడం.. గెలిచిన తరువాత మరచిపోవడం పరిపాటిగా మారింది. రైతు బజారు లేక వివిధ రోడ్లు, కూడళ్ల వద్ద కూరగాయలను విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో విక్రయదారులతో పాటు వినియోగదారులకు కూడా అవస్థలు తప్పడం లేదు. బొబ్బిలి పట్టణంలో సుమారు 75 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. వివిధ మండలాలకు చెందిన వందలాది కుటుంబాలు ఈ ప్రాంతంలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ నుంచి సుమారు పది మండలాలకు ప్రభుత్వ ఉద్యోగులు, చిరువ్యాపారులు ఇతర వర్గాల వారు రాకపోకలను సాగిస్తుంటారు. అయితే బొబ్బిలిలో రైతు బజారు లేకపోవడంతో వారంతా కూరగాయల కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రైతులు తాము పండించే కూరగాయలను అమ్ముకునేందుకు పాట్లు పడుతున్నారు. పట్టణంలోని చినబజారు జంక్షన్ వద్ద, మునిసిపల్ కార్యాలయ సమీపంలో, కాలేజీ రోడ్డులో, కృష్ణాటాకీస్ జంక్షన్‌లో ఇలా పలు కూడళ్లలో ఎండలోనే కూరగాయలను అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నారు. రైతు బజారు లేకపోవడంతో చాలామంది రైతులు తక్కువ ధరకు దళారీలకు పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దళారీలు మాత్రం అధిక ధరకు కూరగాయలను విక్రయిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఏఎంసీ చైర్మన్ ఇంటి గోపాలరావు చొరవతో స్థానిక డీసీఎంస్ గోదాముల స్థలంలో తాత్కాలికంగా షెడ్లను నిర్మించి రైతు బజారును ఏర్పాటు చేశారు. అది మూన్నాళ్ల ముచ్చటే అయింది. తాత్కాలిక రైతు బజారును పూర్తిగా ఎత్తివేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన కొత్తలో స్థానిక మేదరబంద షాపింగ్ కాంప్లెక్స్ వెనుక గల బందను మట్టితో పూడ్చి చదును చేసి రైతు బజారు ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ నాయకులు హడావుడి చేశారు.

## గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** గిరి జన గ్రామాల అభివృద్ధే లక్ష్య మని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలంలో రూ.5కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో స మావేశాలు ఏర్పాటు చేశారు. సొండిపూడిలో ఆరోగ్య మిషన్ నిధులు రూ.29 లక్షలతో నిర్మించిన విలేజ్, హెల్త్ క్లీనిక్, సిద్దిగాం పంచాయతీ శ్రీరాంపురం గ్రా మంలో నాబార్డు నిధులు రూ.30లక్షలతో నిర్మించిన మందస పీఏసీఎస్ గొదాం ను ప్రారంభించారు. పీఎం జన్మన్ నిధులు రూ.3.65కోట్లతో గౌడగురంటి- అం బటి కంబారం రోడ్డుకు శంకుస్థాపన చేశారు. హెున్నాళి పంచాయతీ కొరడాబ డిలో రూ.లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం ప్రారంభం, జల్ జీవన్ పథ కంలో కొంకడాపుట్టి పంచాయతీలో రూ.38.50లక్షల వ్యయంతో మందస పట్ట ణంలో రూ.73.40లక్షలతో ఇంటింటా కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఈఈ రవి, జేఈఈ ధనుంజయ్, టీడీపీ నాయకులు బావన దుర్యోధన, తమరి భాస్కరరావు, కొర్ల కన్నారావు, బమ్మిడి కర్రయ్య, మిస్కా గణ పతి, ఈశ్వర్రావు, సాలిన మాధవరావు, జానకిరావు, రట్టి లింగరాజు, బైరిశెట్టి గున్నయ్య, గొర్లె హరీష్, మంగళపాత్రో, మండల లచ్చయ్య, రుద్రయ్య, మహేష్, పీఏసీఎస్ అధికారులు పాల్గొన్నారు

## ఉగాదికి ఇళ్లు పూర్తవుతాయా?

### లక్ష్యం చేరేందుకు ప్రభుత్వం ఆపసోపాలు



**రాజాం, పతాకం న్యూస్:** నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో లేఅవుట్లు వేసింది. కొండలు చెంత, ఊరికి దూరంగా సెంటు, సెంటున్నర స్థలాలు కేటాయించింది. ఇదే లబ్ధిదారుల విముఖతకు కారణమైంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిస్థాయిలో ఇంటి నిర్మాణం జరగలేదు. వాటిని పూర్తిచేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. అయితే లక్ష్యం తలకు మించిన భారంగా మారింది. లబ్ధిదారులకు భరోసా కల్పించి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నా స్పందన అంతంతమాత్రంగా ఉంది. ఆ ఇళ్ల నిర్మాణం పూర్తయితే కానీ కేంద్ర ప్రభుత్వం కొత్త ఇళ్లను మంజూరు చేసే అవకాశం లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం వాటిని పూర్తిచేసే పనిలో పడింది. ఉగాదికి టార్గెట్ పెట్టుకుంది. పూర్తయ్యే అవకాశాలైతే కనిపించడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో 984 లేఅవుట్లలో 1,16,447 మందికి ఇళ్ల స్థలం కేటాయించారు. విజయనగరం జిల్లాకు సంబంధించి 583 లేఅవుట్లలో 71,854 ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి. రకరకాల కారణాలు చెప్పి లబ్ధిదారులు నిర్మాణానికి ఆసక్తి చూపలేదు. గత 20 నెలల్లో కూటమి ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో 47,021 మంది పనులు పూర్తిచేశారు. ఇంకా 24,833 ఇళ్లకు సంబంధించి పనులు పూర్తికాలేదు. ఆ లబ్ధిదారులంతా విముఖత చూపుతున్నారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇంట్లో నివాసం ఉండేందుకు సైతం సుముఖత చూపడం లేదు. దీంతో ఉగాదికి మిగతా ఇళ్ల నిర్మాణం పూర్తికావడం అనేది అనుమానమే అని అధికారులు చెబుతున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. అప్పటికి ముందున్న టీడీపీ ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు మంజూరు చేయగా.. ఇళ్ల స్థలాలు ఇచ్చామన్న నెపంతో జగన్ ప్రభుత్వం రూ.20 వేలు తగ్గించి రూ.1.80 లక్షలు అందించడానికి నిర్ణయించింది. అయితే పెరిగిన గృహనిర్మాణ సామగ్రి ధరలతో ఆ మొత్తం ఎటూ చాలకపోవడంతో లబ్ధిదారులు విముఖత చూపారు. చాలా మంది అసలు పనులే ప్రారంభించలేదు. చివరకు లబ్ధిదారుల్లో డ్వాక్రా సంఘాల సభ్యులు ఉంటే అదనంగా రూ.30 వేలు అందిస్తామని అధికారులు ప్రోత్సహించినా ముందుకు రాలేదు. కనీసం వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్ల పనులైనా పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల హౌస్ ఫర్ ఆల్ పేరిట ఇంటి నిర్మాణ దరఖాస్తులు స్వీకరించారు. ఉగాదికి ఇవి పూర్తయితే జాబితాలను ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## తీరం భద్రతపై అవగాహనే లక్ష్యం



**అరసవల్లి, పతాకం న్యూస్:** తీరప్రాంత పరిరక్షణ, భద్రతపై సీఐ ఎస్ఎఫ్ బృందం అవగాహనే లక్ష్యంగా సైకిల్‌యాత్ర నిర్వహిస్తోందని, ఆయా ప్రాంతాల్లో గల సమస్యలను గుర్తించిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వందేమాతరం గీతం ప్రారంభమై 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సీఐఎస్ఎఫ్ బృందం దేశవ్యాప్తంగా చేపట్టిన కోస్టల్ సైక్లోథాన్ యాత్ర అరసవల్లికి చేరుకుంది. ఈ మేరకు ఉదయం యాత్రను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు సైకిల్ యాత్రికులకు హారతులిచ్చారు. రోడ్డుకు ఇరువైపులా ప్రజలు నిల్చొని వారిపై పూలుజల్లి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 3,500 కిలోమీటర్లు యాత్ర నిర్వహిస్తున్నారని, జిల్లాలో తొలుత బారువ బీచ్, అనంతరం కళింగపట్నం చేరుకున్నారన్నారు. జిల్లాలో గల 193 కిలోమీటర్ల తీరప్రాంత అభివృద్ధి, రక్షణకు సంబంధించి వారు సూచనలు, సలహాలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 65 మంది సీఐఎస్ఎఫ్ బృంద సభ్యులు పాల్గొంటున్నారని, జిల్లాలో వారికి లభించిన అతిథ్యం పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పోలీసులు విధిగా హెల్మెట్లు ధరించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** పోలీసులు విధిగా హెల్మెట్లు ధరించి రోడ్డుపైకి రావాలని, చట్టం దృష్టిలో అందరూ సమానమేనని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. పోలీసులు నిబంధనలు పాటిస్తేనే ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్లు పెట్టుకొని ప్రయాణాలు చేస్తారన్నారు. బలిజిపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రోడ్డు భద్రత, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎదురయ్యే సమస్యలను వాహనదారులకు అవగాహన కల్పించాలని, అప్పటికీ వినకపోతే జరిమానా విధించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు సంబంధిం చిన రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఈ పరిశీలనలో ఎస్ఐ సింహాచలం, ఏఎస్ఐ రమణ తదితరులు ఉన్నారు.

## మలేరియా నియంత్రణకు వైద్యులు కృషి చేయాలి



**సాలూరు, పతాకం న్యూస్:** జిల్లాలో మలేరియా నియంత్రణకు వైద్యులు మరింత కృషి చేయాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. 'మా ఊరికి మలేరియా వచ్చింది' కార్యక్రమంలో భాగంగా దిగువమెండంగిలో ఆయన పర్యటించారు. గ్రామంలో మలేరియా బాధితుని పరామర్శించి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.ఆ ప్రాంతంలో పారిశుధ్యం, డ్రైడే నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి వైద్యసేవలపై వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఆ తర్వాత గ్రామంలో నిర్వహి స్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఎటువంటి వ్యాధులు ప్రబలినా తక్షణ సమాచారమందే విధంగా వైద్యులు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తదితరులతో సమన్వయం చేసుకొని గ్రామ ముస్తాబు నిర్వహణకు పనిచేయాలన్నారు. ఆయన వెంట జిల్లా ఎన్‌సీడీ అధికారి జగన్మోహనరావు, డీఎంవో మణి, మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డి.శివకుమార్, కౌశిక్, డీఎల్‌పీవో నాగభూషణ, తోణాం వైద్యాధికారి అజయ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

## లడ్డూ వివాదానికి ఇకనైనా స్వస్థి పలకాలి: రామకృష్ణ



**అమరావతి, పతాకం న్యూస్:** తిరుపతి లడ్డూ వివాదానికి ఇకనైనా స్వస్థి పలికి, కల్తీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో ఏ సమస్య లేనట్లు లడ్డూ సమస్యపైనే అధికార ప్రతిపక్ష పార్టీల వాదోపవాదాలు సాగుతున్నాయని, ఈ వైఖరి టిటిడి లడ్డూ పవిత్రతకు భంగం కలిగేలా ఉందని అన్నారు. తప్పు చేసిన వాళ్లు ఎంతటి వారైనా న్యాయస్థానంలో నిలబెట్టి, జైలుకు పంపాలని, అలా చేయకుండా ప్రచారాస్త్రంగా మలుచుకోవడం విచారకరమని తెలిపారు. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న 43 విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ఉపాధ్యాయులు లేరని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.

# ఇళ్ల లబ్ధిదారులకే నిధులు

## ఏప్రిల్ ఒకటి నుంచి బ్యాంకు ఖాతాలకు జమ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అందించే నిధులను పలు రాష్ట్రాలు దారి మళ్లిస్తున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఈ పథకానికి సంబంధించిన నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకే జమ చేయాలని నిర్ణయించింది. ఈ విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ నిర్ణయంతో నగర శివారు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లలో అయోమయం నెలకొంది. ఇప్పటికే బిల్లుల చెల్లింపుల్లో జాప్యం ఎదురవుతున్న పరిస్థితిలో, నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమైతే తాము చేసిన పనులకు సకాలంలో డబ్బులు అందుతాయా అనే అనుమానాలు కాంట్రాక్టర్లను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు కాంట్రాక్టర్లు పనులకు ముందుకు రావడంలో వెనుకంజ వేస్తున్నారు.

నగర శివారు ప్రాంతాల్లో ప్రభుత్వం 65 లేఅవుట్‌లు అభివృద్ధి చేసి లబ్ధిదారులకు సెంటు చొప్పున స్థలాలు కేటాయించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందిస్తోంది. అయితే తాజాగా కేంద్రం నిధుల విడుదలపై ఆంక్షలు విధిస్తూ, ఏప్రిల్ 1 నుంచి నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ చేయాలని ఆదేశించింది. దీంతో నగర శివారులో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలపై అనిశ్చితి నెలకొంది.ఈ 65 లేఅవుట్‌లలో మొత్తం 1,40,798 మంది లబ్ధిదారులకు సెంటు చొప్పున స్థలాలు కేటాయించగా, 1,14,821 ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరయ్యాయి. తొలిదశలో 80,833 ఇళ్లకు అనుమతి ఇచ్చారు. నగరానికి దూరంగా ఉండటంతో చాలామంది లబ్ధిదారులు సొంతంగా ఇళ్లు నిర్మించేందుకు ముందుకు రాలేదు. దీంతో గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్ల విధానాన్ని అమలు చేసింది. లబ్ధిదారుడు, కాంట్రాక్టర్, సంబంధిత బ్యాంకు మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు ముందుగా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు చేరి, అక్కడి నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో జమై, అనంతరం కాంట్రాక్టర్ల ఖాతాలకు బదిలీ అవుతున్నాయి. ఇనుము, సిమెంట్, ఇసుకను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అయినప్పటికీ మూడేళ్ల క్రితం ప్రారంభమైన ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికీ సగం మాత్రమే పూర్తయ్యాయి.ఇప్పటివరకు 35,202 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, మిగిలిన 45,631 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో సుమారు 25 వేల ఇళ్లు పునాది దశలోనే ఉండగా, 12 వేల ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. మిగిలినవి గోడలు, స్లాబ్ దశల వరకు వచ్చాయి. గత ఏడాది సెప్టెంబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో పడటంతో కాంట్రాక్టర్లు నాలుగు నుంచి ఐదు నెలలుగా పనులు నిలిపివేశారు. గత నెలలో కొంతమేర బిల్లులు మంజూరైనా, అవి కార్మికులకు అందకపోవడంతో వారు ఇంకా పనులకు హాజరుకాలేదు. ఈ పరిస్థితుల్లో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్లు ఇటీవల అధికారులకు హామీ ఇచ్చారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2021లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు ఇంకా పూర్తికాకపోవడంపై కేంద్ర ప్రభుత్వం పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసింది. గడువును పలుమార్లు పొడిగించిన కేంద్రం, చివరగా ఈ ఏడాది సెప్టెంబరు చివరి వరకు గడువు ఇచ్చింది. నిర్మాణాలు పూర్తయ్యే దశలవారీగా నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అయితే సెంటు భూమిలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడంలో సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్న కాంట్రాక్టర్లు పనులకు దూరంగా ఉండటమే మంచిదని భావిస్తున్నారు.గతంలో చేసిన పనులకు బిల్లుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందని, ఇకపై నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమైతే అవి తమకు అందడంలో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయనే ఆందోళన కాంట్రాక్టర్లలో నెలకొంది. ఈ పరిస్థితుల్లో లబ్ధిదారులు సొంతంగా ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వస్తారా? లేకపోతే సెప్టెంబరు తర్వాత నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉందా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి స్పష్టత తీసుకురావాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## మన్యంలో రికార్డు స్థాయిలో ధర పలుకుతున్న 'జాఫ్రా'



**చింతపల్లి, పతాకం న్యూస్:** మన్యంలో జాఫ్రా (అన్నటో) ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. ప్రాంతీయ మార్కెట్‌లో ప్రైవేటు వర్తకులు, ఎఫ్‌పీవోలు కిలో జాఫ్రా గింజలను రూ.280 లకు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది కంటే అధిక ధర లభించడంతో ఆదివాసీ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి అల్లూరి జిల్లా పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో రైతులు పంట పొలాల గట్లపై జాఫ్రాను సాగు చేస్తున్నారు. జాఫ్రా మొక్కల ఆకులను పశువులు ఆహారంగా తీసుకోవు. దీంతో రైతులు ప్రధానంగా పంట పొలాల గట్లపై కంచెగాను, మరోవైపు అదనపు ఆదాయం కోసం జాఫ్రాను సాగు చేస్తున్నారు. ఈ మొక్కల సాగుకి పెద్దగా పెట్టుబడి పెట్టాల్సిన అవసరంలేదు. నాటిన మూడో ఏడాది నుంచి దిగుబడి ప్రారంభం అవుతుంది. ఈ మొక్కలకు తెగుళ్లు ఆశించిన దాఖలాలు లేవు. గిరిజన ప్రాంతం వాతావరణం జాఫ్రా సాగుకు అత్యంత అనుకూలం. దీంతో మెజారిటీ రైతులు పంట పొలాల చుట్టూ కంచెగా నాటుకుంటున్నారు. మరికొంతమంది రైతులు ఆదాయం కోసం పంట పొలాల్లో సాగు చేస్తున్నారు. జాఫ్రా గింజల నుంచి సహజ సిద్ధమైన రంగు లభిస్తుంది. దీంతో జాఫ్రాను ఆర్గానిక్ ఫుడ్ కలర్స్‌గానూ, కాస్మోటిక్స్‌లోనూ అధికంగా ఉపయోగిస్తున్నారు. దీంతో జాఫ్రాకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఆహార ఉత్పత్తులు, కాస్మోటిక్స్‌లో సింథటిక్ కలర్స్ వినియోగించడం వల్ల గతంలో జాఫ్రా గింజలకు ధర తక్కువగా ఉండేది. ప్రస్తుతం ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక డిమాండ్ పెరగడంతో జాఫ్రా గింజలకు మంచి ధర లభిస్తున్నది. 2023 వరకు జాఫ్రా గింజలను ప్రాంతీయ మార్కెట్‌లో ప్రైవేటు వర్తకులు కిలో రూ.90-100 ధరకు కొనుగోలు చేసేవారు. 2024లో ఒకేసారి జాఫ్రా ధర రూ.170, 2025లో రూ.250 ధర లభించింది. జాఫ్రా ధర పెరగడం వల్ల ఆదివాసీ రైతులు ఈగింజలను ప్రత్యేకంగా సేకరించి మార్కెట్ చేసుకుంటున్నారు. ఈఏడాది (2026)లో మార్కెట్ ప్రారంభంలోనే జాఫ్రా గింజలకు రూ.260 ధర లభించగా, ప్రస్తుతం రూ.280లకు ప్రైవేటు వర్తకులు కొనుగోలు చేస్తున్నారు. జాతీయ మార్కెట్‌లో కిలోకి రూ.220 ధర లభిస్తున్నది. ఈమేరకు గిరిజన ప్రాంతంలో జాఫ్రా గింజలను కొనుగోలు చేసేందుకు వర్తకులు పోటీపడుతున్నారు. చింతపల్లి, జీకేవీధి, జి.మాడుగుల మండలాల్లో ధింసా ఆర్గానిక్ రైతు ఉత్పత్తిదారుల సంఘం కిలో రూ.280 గరిష్ఠ ధరకు కొనుగోలు చేస్తుందని సీఈవో వాడకాని దేవి ప్రవళిక తెలిపారు. జాఫ్రా మార్కెటింగ్ కోసం రైతులు 7981637171, 9019963131 నంబర్లను సంప్రదించవచ్చునన్నారు.

## ట్రావెల్ బస్సులో అగ్ని ప్రమాదం.. 39 మంది ప్రయాణికులు సురక్షితం

**కంచికచర్ల, పతాకం న్యూస్:** ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర ( పేరలపాడు ఎన్ఎస్పీ కెనాల్ ) సమీపంలో శనివారం తెల్లవాజామున ఓ ట్రావెల్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదం నుంచి 39 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. హైదరాబాదు నుండి విజయవాడ వస్తున్నబస్సు కంచికచర్ల మండలం కేసర టోల్‌గేట్ వద్ద బస్సు వెనక ఇంజిన్‌లో పొగలు వచ్చాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే ప్రయాణికులంతా సురక్షితంగా బస్సు నుంచి దిగిపోయారు. అనంతరం మంటల్లో బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంపై సమచారం అందుకున్ననేషనల్ హైవే సిబ్బంది మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



# రక్తనాళాల్లో బ్లాక్స్ ఉన్నాయా..?

శరీరం గుండా ఆక్సిజన్ ను, రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు ధమనులు. గుండె ఆరోగ్యం ఉండడంలో ఇవి ముఖ్య పాత్ర పోషిస్తాయి. ధమనుల లోపలి గోడల్లో కొలెస్ట్రాల్ పేరుకు పోవడం వల్ల ధమనులు మూసుకుపోతాయి. కాలక్రమేణా ఇది రక్తసరఫరాను తగ్గిస్తుంది. దీని వల్ల గుండెపోటు, స్ట్రోక్ లేదా మరణం వంటివి వచ్చే ప్రమాదం ఉంది. శరీరం గుండా ఆక్సిజన్ ను, రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు ధమనులు. గుండె ఆరోగ్యం ఉండడంలో ఇవి ముఖ్య పాత్ర పోషిస్తాయి. ధమనుల లోపలి గోడల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల ధమనులు మూసుకుపోతాయి. కాలక్రమేణా ఇది రక్తసరఫరాను తగ్గిస్తుంది. దీని వల్ల గుండెపోటు, స్ట్రోక్ లేదా మరణం వంటివి వచ్చే ప్రమాదం ఉంది. కనుక ధమనులు మూసు కుపోకుండా జాగ్రత్త వహించాలి. ధమనులు ఆరోగ్యంగా ఉంటేనే గుండె ఆరోగ్యంగా, గుండెపై ఎక్కువగా ఒత్తిడి పడకుండా ఉంటుంది. కనుక ధమనుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా చాలా అవసరం. మనం తీసుకునే కొన్ని రకాల ఆహారాల ద్వారా ధమనుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ధమనులు మూసుకుపోయిన సమస్యతో బాధపడే వారు అలాగే ఈ సమస్య రాకూడదు అని భావించే వారు ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ధమనుల ఆరోగ్యాన్ని కాపాడే, మూసుకుపోయిన ధమనుల సమస్యను తగ్గించే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. మూసుకు పోయిన ధమనుల సమస్యతో బాధపడే వారు ఓట్స్ ను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వీటిలో ఫైబర్ తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇన్‌ఫ్లమేషన్ తగ్గిం చడంలో, శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. ఓట్స్ ను తీసుకోవడం వల్ల ధమనుల్లో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోకుండా ఉండడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. సుగంధ ద్రవ్యాల్లో కూడా యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు అధికంగా ఉంటాయి. ఫ్రీరాడికల్స్ ను తగ్గించడంలో ఇవి ఎంతో దోహదపడతాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గడం వల్ల ధమనులు, గుండె ఆరోగ్యంతో పాటు శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అల్లం, మిరపకాయలు, దాల్చిన చెక్క, మిరియాలు వంటి వాటిని తీసుకోవడం వల్ల ధమనులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు గుండె జబ్బులు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుంది. ధమనులు మూసుకుపోకుండా నిరోధిం చడంలో టమాటాలు అద్భుతంగా పనిచేస్తాయి. టమాటాల్లో లైకోపీన్, విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్, విటమిన్ ఇ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. టమాటాలను అల్లం, దాల్చిన చెక్క వంటి సుగంధ ద్రవ్యాలతో కలిపి తీసుకోవడం వల్ల మరింత మేలు కలుగుతుంది. అలాగే ధమనులు మూసుకుపోకుండా చేయడంలో క్యాబేజి, బ్రోకలీ, కాలీఫ్లవర్ వంటి కూరగాయలు ఎంతో దోహదపడతాయి. వీటిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ధమనులు మూసుకుపోయే అవకాశాలు తక్కువగా ఉంటాయి. సిట్రస్ జాతి పండ్లను తీసుకోవడం వల్ల గుండె జబ్బులతో పాటు గుండెపోటు వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుంది. ఈ పండ్లల్లో విటమిన్స్, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్ ను తగ్గించి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.



చేపలను తీసుకోవడం కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. వీటిలో ఒమెగా 3ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గేలా మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తాయి. చేపలను తీసుకోవడం వల్ల వాపు తగ్గడంతో పాటు రక్తం గడ్డకట్టడం కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ విధమైన ఆహారాలను తీసుకోవడం వల్ల ధమనులు మూసుకుపోవడం తగ్గడంతో పాటు ఈ సమస్య భవిష్యత్తులో కూడా రాకుండా ఉంటుందని, ఈ ఆహారాలు గుండె ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు.

# ముల్తానీ మట్టితో చర్మానికి రక్షణ



ముల్తానీ మట్టి.. అందం కోసం పరితపించేవారికి దీని గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. చర్మానికి మేలు చేసే ఈ మట్టి లేనిదే బ్యూటీ ప్రొడక్ట్స్ లేవు. ఎలాంటి రసాయనాలు లేని ఈ స్వచ్ఛమైన మట్టిలో ఉండే సహజ ఖనిజాలే.. చర్మానికి రక్షణ కలిగిస్తాయి. కాసుల వర్షం కురిపిస్తున్న ఈ మట్టి ఎక్కడ లభిస్తుందో తెలుసా?

ఇలాంటి మట్టి ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో లభిస్తుంది. అయితే, పాకిస్థాన్‌లోని ముల్తాన్‌లో ఉండే మట్టి మాత్రమే మేలైనదని భావిస్తున్నారు. అందుకే, ఎక్కువ మంది ముల్తాన్‌లో లభించే మట్టిని సేకరించేందుకు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. అందుకే ఈ మట్టిని 'ముల్తానీ మిట్టీ లేదా ముల్తానీ మట్టి' అని పిలుస్తారు. అయితే, ఈ మట్టి వల్ల చర్మానికి ఎలాంటి సమస్య ఉండదు. బ్రాండెడ్ సంస్థలు విక్రయించే మట్టిని కొనడమే మేలు.

ముల్తానీ మట్టిలో మెగ్నీషియం, క్వార్ట్జ్, సిలికా, ఇనుము, కాల్షియం, కాల్సైట్, డోలమ్కెట్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ మట్టి ఎక్కువగా పౌడర్ రూపంలోనే లభిస్తుంది. తెలుగు, నీలం, ఆకుపచ్చ, గోదుమ రంగుల్లో ఎక్కువగా లభిస్తుంది. చర్మం, జుట్టు సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ముల్తానీ మట్టి ఒక వరం. మరి, ఈ మట్టి వల్ల ఎన్ని రకాల ప్రయోజనాలు ఉన్నాయో చూసేద్దామా!

జిడ్డును గ్రహిస్తుంది: సాధారణంగా మట్టికి పీల్చే గుణం ఎక్కువ. అందుకే, ముల్తానీ మట్టిని ముఖానికి రాయగానే ముందుగానే చర్మాన్ని జిడ్డులా మార్చే నూనెలను పీల్చేస్తుంది. చర్మ రంధ్రాల్లో క్లాగ్ లేకుండా చూస్తుంది. చర్మం పీహెచ్ (%జూ౧%) స్థాయిలను సమతుల్యం చేస్తుంది. అందుకే, ఎక్కువ మంది దీన్ని ఫేస్‌ప్యాక్‌గా వినియోగిస్తారు. చర్మంపై మచ్చలను తొలగించేందుకు ఇది మంచి ఔషదం.

మొటిమలు మటుమాయం: మొటిమ లను తొలగించడంలో ముల్తానీ మట్టి బాగా ఉపయోగపడుతుంది. చర్మంపై జిడ్డుగారే నూనెల వల్ల మొటిమలు ఏర్పడతాయనే సంగతి తెలిసిందే. ముల్తానీ మట్టిని ముఖానికి రాసినట్లయితే జిడ్డు మాయమవుతుంది. అలాగే, మొటిమల వల్ల ముఖంపై ఏర్పడు గుంటలను కూడా తొలగిస్తుంది. చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది.

చర్మానికి మంచి రంగు ఇస్తుంది: మీ మేను మెరవాలంటే.. ముల్తానీ మట్టిని రాయాల్సిందే. దీన్ని మీ చర్మానికి పూసుకోవడం ద్వారా రంగు మారుతుంది. డార్క్ స్కిన్‌తో బాధపడేవారికి ఇది ఉపయోగపడుతుంది. మరీ తెల్లగా మార్చుకున్నా.. చర్మాన్ని కాంతివంతంగా కనిపించేందుకు సహకరిస్తుంది. చర్మంపై ఉండే మృత కణాలను తొలగిస్తుంది.

చుండ్రు నుంచి ఉపశమనం: చుండ్రు సమస్యతో బాధపడుతున్నట్లయితే ముల్తానీ మట్టిని ట్రై చేయండి. చుండ్రుకు కారణమయ్యే గ్రీజు, దూళిని ఈ మట్టి గ్రహిస్తుంది. తల చర్మంలోని రక్త ప్రసరణ మెరుగుపరుస్తుంది. 20 నిమిషాల తర్వాత మట్టిని షాంపూతో శుభ్రం చేయాలి. ఆ తర్వాత కండీషనర్ రాసుకోవాలి. దీనివల్ల జుట్టు చిట్లకుండా ఆరోగ్యకరంగా ఉంటుంది.

# విశాఖలో దిగ్విజయంగా 'గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2026'



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ విశాఖ నగరంలో "వైజాగ్ బిగ్గెస్ట్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2026, షార్ట్ ఫిలిం కాంపిటేషన్" శనివారం దిగ్విజయంగా జరిగింది. హైదరాబాదుకు చెందిన ప్రముఖ విద్యా సంస్థ బ్లూ రిబ్బన్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన సుమారు 30 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పైడే కఅష్ణ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ .... డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి ఇలాంటి ఎడ్యుకేషన్ ఫెయిర్లు మార్గదర్శిగా నిలుస్తాయని ప్రశంసించారు. భవిష్యత్తులో విద్యార్థుల కోసం మరిన్ని ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం బ్లూ రిబ్బన్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ డైరెక్టర్ పి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ తన 18 ఏళ్ల వఅత్తి జీవితంలో విశాఖ విద్యార్థుల నుండి వచ్చినంతటి అద్భుతమైన స్పందన ఎక్కడా చూడలేదని హర్షం వ్యక్తం చేశారు. "మన దేశంలోని ముంబై వంటి నగరాల్లో చదువుకోవడం కంటే యూరోప్ దేశాల్లో విద్య అత్యంత చవకగా లభిస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చేందుకు మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థల నుండి ట్రైనర్లను రప్పించాము. అలాగే, కపిల్ గ్రూప్‌కు చెందిన టాస్క్ అకాడమీ ద్వారా నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేక ఒప్పందం చేసుకున్నాము" అని ఆయన వివరించారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, యూరోప్, న్యూజిలాండ్, సౌత్ కొరియా వంటి దేశాల్లోని 25కు పైగా అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలతో తమకు ఒప్పందాలు ఉందని తెలిపారు. విద్యార్థులకు వారి ప్రతిభ ఆధారంగా 85% వరకు స్కాలర్‌షిప్‌లు ఇప్పిస్తున్నామని. విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు తొలగించేందుకు 100% లోన్ అసిస్టెన్స్ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విదేశీ ప్రయాణానికి ముందే విద్యార్థులను సిద్ధం చేసేందుకు 'జంప్ స్టార్ట్ క్యాంపస్' ప్రోగ్రామ్ అందుబాటులో ఉందని, మరిన్ని వివరాలకు తమ వెబ్సైటును సంప్రదించాలని కోరారు. శనివారం జరిగిన ఎడ్యుకేషన్ ఫెయిర్ లో 800 -1000 విద్యార్థులు పాల్గన్నారు అలయన్స్ ఇన్‌స్టిట్యూట్ డీన్ కొల్లా సతీష్ కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గని విద్యార్థులకు సూచనలు అందించారు.

# శరవేగంగా పోలవరం ఎడమ కాలువ పనులు

## మరో ఏడాదిలో గోదావరి జలాలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణ పనులు జోరందుకున్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటిని విడుదల చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జలవనరుల శాఖ అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఈ క్రమంలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, కశింకోట మండలాల్లో కాలువకు సంబంధించిన వివిధ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

పోలవరం ఎడమ కాలువ పనులను జిల్లాలో 6, 7, 8 ప్యాకేజీలుగా విభజించి చేపట్టారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి ఆరో ప్యాకేజీలో సుమారు 70 శాతం, ఏడో ప్యాకేజీలో దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే ఎనిమిదో ప్యాకేజీ పనులు అప్పటికి ప్రారంభం కాలేదు. ఆరో ప్యాకేజీ పాయకరావుపేట పట్టణంలోని తాండవ షుగర్స్ సమీపం నుంచి ప్రారంభమై, ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద ముగుస్తుంది. ఈ ప్యాకేజీలో 24 కిలోమీటర్ల మేర కాలువ తవ్వకం, సిమెంట్ లైనింగ్, వంతెనలు, అండర్ టన్నెళ్లు, సూపర్ పాసేజీలు, ఓవర్ టన్నెళ్లు, క్రాస్ రెగ్యులేటర్లు వంటి మొత్తం 87 నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే పనులకు గణనీయమైన పురోగతి కనిపించింది. 2019 జనవరి నాటికి ఎక్కువ భాగం పనులు పూర్తయ్యాయి. అనంతరం వైసీపీ పాలనలో నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. ప్రతి ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ, వాటిని విడుదల చేయకపోవడం వల్ల ఐదేళ్ల పాటు ఇదే పరిస్థితి కొనసాగింది. ఏడో ప్యాకేజీలో గత టీడీపీ ప్రభుత్వ కాలంలో 75 శాతం వరకు పనులు పూర్తికాగా, వైసీపీ హయాంలో స్వల్పకాలం మాత్రమే పనులు జరిగి మొత్తం మీద 10 శాతం కూడా పురోగతి నమోదు కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోగా ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు సాగునీరు, తాగునీరు, పరిశ్రమల అవసరాలకు నీరు అందించాలనే లక్ష్యంతో జలవనరుల శాఖ కార్యాచరణ ప్రారంభించింది. పాత టెండర్ల గడువు ముగియడంతో వాటిని రద్దు చేసి, మిగిలిన పనులకు గత ఏడాది కొత్తగా టెండర్లు పిలిచారు. మొత్తం ఎనిమిది ప్యాకేజీల పనులకు రూ.3,198 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అనకాపల్లి జిల్లాలో ఆరో ప్యాకేజీకి సంబంధించిన పనులను మధుకాన్-సినో హైడ్రో, బీఎస్ఆర్ సంస్థలకు అప్పగించారు. ఏడో ప్యాకేజీ పనులను కేసీఎల్--జేసీసీజీ జాయింట్ వెంచర్, ఐవీఆర్సీఎల్--న్యూకు, ఏసీఎల్ సంస్థలకు కేటాయించారు. ఎనిమిదో ప్యాకేజీ పనులు ఆర్‌కేఎన్ ఇన్‌ఫ్రాకు అప్పగించారు. ప్రస్తుతం పాయకరావుపేట సమీపంలోని దుర్గానగర్ కొండను తొలగించే పనులు కొనసాగుతున్నాయి. అలాగే కాలువ తవ్వకం, సిమెంట్ లైనింగ్ పనులు, ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద వరహా నదిపై అక్విడక్టు నిర్మాణం తుది దశకు చేరుకున్నాయి. ఏడో ప్యాకేజీలో తాళ్లపాలెం వరకు సుమారు 50 కిలోమీటర్ల మేర కాలువ తవ్వకం పనులు వేగంగా సాగుతున్నాయి.

వచ్చే ఏడాది మార్చి నాటికి ఎడమ కాలువ పనులన్నీ పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2027 ఖరీఫ్ నాటికి జిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం.




# ఐసీసీ అండర్-19 వన్డే ప్రపంచకప్ విజేత భారత్




ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో భారత యువ ఆటగాళ్లు అదరగొట్టారు. ఈ సీజన్‌లో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ విజయాన్ని నమోదు చేసుకొని విజేతగా నిలిచారు. గ్రూప్ దశలో, సూపర్-6తో పాటు సెమీస్, ఫైనల్లోనూ ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపిస్తూ.. టైటిల్ విజేతగా నిలిచారు. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో ఇంగ్లండ్‌తో శనివారం జరిగిన టైటిల్ పోరులో భారతజట్టు 100 పరుగులు తేడాతో ఘన విజయం సాధించింది. 14ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కేవలం 80బంతుల్లో 175పరుగులకి తోడు.. కెప్టెన్ ఆయుష్ మాత్రే(53), అభిజ్ఞాన్ కుందు(40) రాణించడంతో భారతజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీస్కోర్ చేసింది. ఛేదనలో ఇంగ్లండ్ ధాటిగానే ఆడినా.. కొండంత లక్ష్యాన్ని ఛేదించలేక 40.4ఓవర్లలో 311 పరుగులకే చతికిలపడింది. 2000, 2008, 2012, 2018, 2022లలో టైటిల్ విజేతగా నిలిచిన భారతజట్టు.. ఆరోసారి ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడింది. ఫైనల్లో టీమిండియా యువ సంచలనం 14ఏళ్ల వైభవ్ సూర్యవంశీ రెండు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అండర్-19 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో తక్కువ బంతుల్లో సెంచరీ, అత్యధిక స్కోర్ కొట్టిన తొలి ఆటగాడిగా రికార్డు పుటల్లోకెక్కాడు.

టీమిండియా యువ సంచలనం 14ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఇంగ్లండ్‌తో జరిగిన ఫైనల్లో అదరగొట్టే ప్రదర్శన కనబర్చి టీమిండియా టైటిల్ కైవసం చేసుకోవడంలో కీలకపాత్ర పోషిం చాడు. కేవలం 80బంతుల్లోనే 175 పరుగులతో రాణించిన సూర్యవంశీ.. మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్‌ను గుర్తుచేశాడు. 1983 వన్డే ప్రపంచకప్‌లో జింబాబ్వేపై 138బంతుల్లో 175పరుగులు చేసి టీమిండియాను ఫైనల్‌కు చేర్చగా.. తాజాగా సూర్యవంశీ 80బంతుల్లో 15ఫోర్లు, 15సిక్సర్లతో 175పరుగులతో రాణించి టీమిండియాకు కప్‌ను అందించాడు. సూర్యవంశీ కొట్టే సిక్సర్లు, ఫోర్లతో స్టేడియం హోరెత్తింది. సెంచరీ 55బంతుల్లో 8ఫోర్లు, 8సిక్సర్లుతో పూర్తి చేసిన సూర్యవంశీ.. ఆ తర్వాత మరింత చెలరేగి ఆడాడు. ఆ తర్వాత ఆడిన 25బంతుల్లోనే 75పరుగులు కొట్టడం గమనార్హం. ఈ క్రమంలో ఇంగ్లండ్ స్పిన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అండర్-19 వరల్డ్‌కప్‌లో అత్యధిక సిక్సర్లు (35సిక్సర్లు) కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు. అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్లలో డెవాల్డ్ బ్రెవిస్ 18(2022), ఫిన్ అలెన్ 18(2016, 2018) సూర్యవంశీ ధనా ధన్ ఇన్నింగ్స్ ముందు కనుమరుగయ్యాయి. కేవలం 14 ఏళ్లకే అసాధారణ ప్రతిభ కనబరిచిన వైభవ్, ఇంగ్లండ్ బౌలర్లను ఫైనల్లో ఉతికి ఆరేశాడు. సూర్యవంశీ ఔటై పెవీలియన్‌కు చేరే సమయానికి భారత జట్టు 27 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. అలాగే భారత్ తరపున తక్కువ బంతుల్లో శతకం బాదిన రాజ్ బావా(69 బంతులు) పేరిట ఉన్న రికార్డును వైభవ్ బద్దలు కొట్టాడు.

యువ భారత్ మరోసారి ప్రపంచ క్రికెట్‌పై తన ఆధిపత్యాన్ని చాటుకుంది. జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన అండర్-19 ప్రపంచకప్ 2026 ఫైనల్లో భారత్ 100 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను మట్టికరిపించింది. ఈ విజయంతో భారత్ రికార్డు స్థాయిలో ఆరోసారి అండర్-19 ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చాడు. వైభవ్, ఆయుష్ రెండో వికెట్‌కు 142 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి టీమిండియా భారీ స్కోరుకు పునాది వేశారు. దీంతో భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగులు చేసింది.

# గాయంతో హర్షిత్ రాణా అవుట్.. సిరాజ్‌కు పిలుపు




ఐసీసీ టీ20 ప్రపంచకప్ వేటలో తొలి మ్యాచ్‌కు ముందే భారత్‌కు గాయాల బెడద మొదలైంది. దక్షిణాఫ్రికాతో వార్మప్ మ్యాచ్‌లో మోకాలి గాయానికి గురైన హర్షిత్ రాణా.. టీ20 ప్రపంచకప్‌కు దూరమయ్యాడు. గాయంతో ఒక్క ఓవర్ అనంతరం మైదానం వీడిన హర్షిత్ రాణా, మళ్లీ గ్రౌండ్‌లో అడుగుపెట్టలేదు. వైద్య పరీక్షలు, నిపుణులతో సంప్రదింపుల అనంతరం హర్షిత్ రాణా ప్రపంచకప్‌లో ఆడలేడనే నిర్ధారణకు వచ్చారు. ప్రపంచకప్ జట్టు నుంచి హర్షిత్ రాణా తప్పుకోగా.. అతడి స్థానంలో మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేశారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ టెక్నికల్ కమిటీ అనుమతితో సిరాజ్‌ను జట్టులోకి తీసుకున్నారు. ప్రధాన పేసర్‌గా, బ్యాట్‌తో హిట్టింగ్ చేయగల సత్తా రాణా సొంతం. సిరాజ్ చివరగా 2024లో ఓ టీ20 మ్యాచ్ ఆడినా.. ఐపీఎల్‌లో 160 మ్యాచ్‌లు ఆడిన విశేష అనుభవం సిరాజ్ సొంతం.




# 'ఇది భ్రమల ప్యాలెస్' అంటున్న రాశీ ఖన్నా




ప్రస్తుతం పవన్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'లో నటిస్తున్న రాశి

మార్చి 26న విడుదల కానున్న చిత్రం

'ఊహలు గుసగుసలాడే' సినిమాతో తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయమైన రాశీ ఖన్నా తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. చివరిగా సిద్ధు జొన్నలగడ్డ సరసన 'తెలుసు కదా' చిత్రంలో కనిపించింది. ఈ సినిమాలో రాశీ ఖన్నాకు మంచి మార్కులు పడ్డాయి. ప్రస్తుతం ఆమె పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో నటిస్తోంది. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. మార్చి 26న ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాలో శ్రీలీల కూడా హీరోయిన్ గా నటిస్తోంది.

మరోవైపు, రాశీ ఖన్నా తాజాగా ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో బ్లాక్ అవుట్ ఫిట్ తో, బ్లాక్ పెండెంట్ ఉన్న చైన్ తో రాశి బోల్డ్ గా కనిపిస్తోంది. ఈ ఫొటోలకు 'ఇది భ్రమల ప్యాలెస్' అంటూ క్యాప్షన్ పెట్టింది.

# అమలా పాల్ కీలక పాత్రలో నటిస్తున్న వాంపైర్ థ్రిల్లర్




ఒకప్పుడు దక్షిణాది సినిమాను తన లుక్స్‌తో, నటనతో ఉర్రూతలూగించిన హీరో అబ్బాస్ చాలా కాలం తర్వాత మళ్లీ వెండితెరపై కనిపించబోతున్నారు. దర్శకుడు సంజద్ తెరకెక్కిస్తున్న 'హాఫ్ – ది క్రానికల్స్ ఆఫ్ టూ హాఫ్-బ్లడెడ్ వాంపైర్స్' అనే వాంపేర్ థ్రిల్లర్ చిత్రంతో ఆయన తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి శుక్రవారం విడుదలైన కొత్త పోస్టర్ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పోస్టర్‌లో అమలా పాల్, రంజిత్ సజీవ్, ఐశ్వర్య రాజ్‌లతో పాటు అబ్బాస్ కూడా ప్రముఖంగా కనిపించారు. 'ప్రేమ దేశం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన అబ్బాస్, చాలా సంవత్సరాల విరామం తర్వాత తిరిగి నటిస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. ఇద్ద వాంపైర్ల (రక్తపిశాచులు) కథగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. గుర్తింపు, మనుగడ, ప్రతీకారం వంటి అంశాలతో ఈ సినిమా కథ సాగుతుందని చిత్ర యూనిట్ తెలిపింది. అమలా పాల్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఫ్రాగ్రంట్ నేచర్ ఫిల్మ్ క్రియేషన్స్ పతాకంపై పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మలయాళం, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

ఈ చిత్రానికి హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్‌తో పాటు పలువురు జాతీయ అవార్డు గ్రహీతలైన ఎడిటర్ మహేశ్ భువనేంద్, ప్రొడక్షన్ డిజైనర్ మోహన్‌దాస్ వంటి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తుండటం విశేషం. మిథున్ ముకుందన్ సంగీతం అందిస్తున్నారు.






# 20న 'జన నాయగన్' విడుదల సన్నాహాలు




దళపతి విజయ్ నటిస్తున్న చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలలో నెలకొన్న ప్రతిష్ఠంభన వీడే సూచనలు కనిపిస్తున్నాయి. సెన్సార్ బోర్డుతో నెలల తరబడి కొనసాగుతున్న వివాదానికి ముగింపు పలికే దిశగా చిత్ర నిర్మాతలు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులకు అంగీకరించి, సినిమాను ఈ నెల 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం వాస్తవానికి సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కావాల్సి ఉంది. అయితే, మతపరమైన విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్న కొన్ని సన్నివేశాలు, దేశ భద్రతకు సంబంధించిన అంశాలపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దీంతో ఈ వ్యవహారం మద్రాస్ హైకోర్టుకు చేరింది. సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్ విచారణల తర్వాత కూడా విడుదలపై స్పష్టత రాకపోవడంతో నిర్మాతలు నష్టాలను నివారించేందుకు రాజీ మార్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం సెన్సార్ బోర్డు అభ్యంతరం చెప్పిన సుమారు 20 నిమిషాల నిడివి గల సన్నివేశాలను తొలగించడానికి, కొన్ని సంభాషణలను మ్యూట్ చేయడానికి నిర్మాతలు అంగీకరించారు. ఇప్పటికే కోర్టులో ఉన్న కేసులను ఉపసంహరించుకుని, మార్పులు చేసిన కొత్త వెర్షన్‌ను సెన్సార్ ముందుకు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. మరోవైపు తాను రాజకీయాల్లోకి వస్తున్నందుకే తన సినిమాను కక్షపూరితంగా లక్ష్యం చేసుకున్నారని విజయ్ చేసిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ చిత్రంలో విజయ్ సరసన పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడిగా, 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎలాంటి కొత్త అడ్డంకులు ఎదురుకాకుండా సెన్సార్ క్లియరెన్స్ లభిస్తే, ఈ నెల 20న 'జన నాయగన్' థియేటర్లలోకి రావడం ఖాయమని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**